

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)




**కాలేజ్** రీ వోపెనింగ్ ముందు కాసిని రోజులు ఖాళీ వచ్చాయి.

నల్లతంబి బ్రేక్‌ఫాస్ట్ చేసి అందరికీ అందించాడు.

'ఏవిటి మన ప్రోగ్రాం యిప్పుడు?' అడిగాడు విజయ్.

'ఈ మధ్య మనం జిమ్‌కి వెళ్లడం మానేశాం. పరీక్షలయిపోయాయి కాబట్టి మన శరీరాల్ని రీ కండిషన్ చేద్దాం' అన్నాడు శశి.

'అలాగే కాస్త మానసికంగా రిలాక్స్ అవడానికి యేవన్నా సినిమాలుకూడా చూద్దాం' అన్నాడు మురళి.

అంతా మెన్స్ హాస్టల్ దగ్గరున్న కాలేజ్ జిమ్‌కి బైల్దేరారు. ఎక్సర్‌సైజులు యెంతో రిలీఫ్‌గా అనిపించాయి. క్రమం తప్పకుండా రోజూ జిమ్‌కి వెళ్లడం అలవాటయింది. ఇక సాయంత్రాలు వరుసగా వూళ్లో ఆడే సినిమాలన్నీ చూడసాగారు. అందరికీ బాగా సినిమా భాష పట్టేసింది. వారి సంభాషణల తీరులో బాగా మార్పు వచ్చింది. కొద్ది రోజుల్లో మళ్లీ కాలేజ్ మొదలయ్యింది. మహీ తప్ప అందరూ కలెక్ట్రాఫీసు జంక్షన్ దగ్గర అజంతా హోటల్ పక్కనున్న భట్టాచార్య మెడికల్ బుక్ షాపులో స్టెతస్కోపులు కొనుక్కున్నారు.

హాస్పిటల్లో క్లినికల్స్‌కీ, ఫార్మా కాలేజీ క్లాసులకీ వెళ్లడం ప్రారంభించారు. మెడలోకి స్టెతస్కోపు రాగానే అందరిలో డాక్టర్లం కాబోతున్నావనే వుత్సాహం వురకలు వేసింది. మహీ మాత్రం వెనుకబడటం వల్ల తన ప్రీ క్లినికల్ రిపీట్‌కి హాస్టల్లో వుండి చదువుతాను అని హాస్టల్‌కి షిఫ్ట్ అయిపోయాడు.

ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గారు కొత్త బ్యాచ్‌కి పాఠాలు మొదలుపెట్టారు. 'మీరు యీ యేడాది అంతా మందు గురించి తెలుసుకుంటారు. మందు అంటే విస్కీ, బ్రాందీ, ఓడ్కా వగైరాలు కాదు. మందు అనగా ఔషధం. రోగాలు తగ్గించడానికీ,

రోగాలు పెరక్కుండా ఆపడానికి సాయపడేదన్నమాట. మందు గురించి బాగా నేర్చుకుంటే ముందుకి వెళ్తారు. అంచేత పదండి ముందుకు' అని స్టూడెంట్స్‌కి సందేశం యిచ్చారు. బాలరాజు, తానీషా బాగా విన్నారు. ఇంకా హాస్పిటల్ వార్డుల్లో క్లినికల్ రౌండ్స్ ఫాలో అవుతూ క్లినికల్ స్కిల్స్ కూడా నేర్చుకోసాగారు.

ఒకరోజు పీడియాట్రిక్స్ క్లినికల్ రౌండ్స్ అసిస్టెంట్స్, పి.జి.ల వెనకే బాలరాజు, తానీషా చేరారు. మురళి, విజయ్, శశి వేరే వార్డుకి వెళ్లారు. బుచ్చిబాబు అనే పి.జి, బాలరాజుని, తానీషాను చేరదీసి 'ఒరేయ్ జూనియర్లూ, ఏవీ కంగారుపడకండి. ఏవన్నా డౌట్లు వస్తే నన్నడగండి' అని భరోసా యిచ్చాడు. బుచ్చిబాబు నాన్నకి చెంగల్రావు పేట మెయిన్ రోడ్డులో పెద్ద కిరాణా కొట్టుంది. అప్పుడప్పుడు తను కూడా కొట్లో కూర్చుని తండ్రికి సాయపడుతూ వుంటాడు.

పీడియాట్రిక్స్ బాస్ ముఖర్జీగారనే లేడీ డాక్టరు. ఆరడుగుల భారీ పెర్సనాలిటీ. వైజాగ్ చుట్టుపక్కల ఆమె పేరు మోసిన పిల్లల డాక్టరు. ఆమె రాగానే స్టూడెంట్స్, హౌస్ సర్జన్లు, పి.జి.లు. అసిస్టెంట్‌లు అంతా సైలెంటయ్యారు. వార్డులో అక్కడా అక్కడా పిల్లల క్యార్ క్యార్ శబ్దాలు తప్ప మరేం వినిపించడంలేదు. ముఖర్జీ మాత తన సైన్యంతో ప్రతీ బెడ్ దగ్గరికి వెళ్లి పేషెంట్స్‌ని చూస్తోంది. తల్లుల్ని పలకరిస్తోంది. పురమాయించిన క్లినికల్ పనులు చేశారా అని స్టాఫ్‌ని అడుగుతోంది. ఒక బెడ్ దగ్గర ఆగి, 'బుచ్చిబాబూ! ఈ కుర్రాడి టెంపరేచరెంతయ్యా?' అని అడిగింది. వెంటనే బుచ్చిబాబు 'నూట్రెండు సిల్లరండి' అన్నాడు.

అందుకు ముఖర్జీమాత, 'బుచ్చిబాబూ! టెంపరేచరు నూట రెండు పాయింటు వొకటో, రెండో, మూడో చెప్పకుండా చిల్లరంటావేంటయ్యా? నీ కిరాణాకొట్టు బుద్ధులు పోనిచ్చు కున్నావు కాదు' అంది. అంతా నవ్వారు. ఆ నవ్వుల మధ్య ప్రత్యేకంగా రేఖ నవ్వు వినిపించింది. ఇన్నాళ్లూ నిన్ను మిస్ అయిపోయాను తల్లీ అనుకుంటూ బాలరాజు, రేఖవేపు చూశాడు. రేఖ, బాలరాజుని చూసీచూడనట్టు చూసింది. బుచ్చిబాబు 'సారీ మేడమ్ - నూట్రెండు పాయింటు రెండండి' అన్నాడు.

ముఖర్జీ మాత 'ఉఁ' అని హూంకరించి వూరుకుంది.

వార్డు రౌండ్స్ అయ్యాక బాలరాజు, తానీషా క్లినికల్ క్యాంటీన్ వేపు కదిలారు.

'రేఖ బావుంటుంది కదూ' అన్నాడు బాలరాజు.

'అవును. నాకు హసీనా బేగం కూడా బావుంటుంది' అన్నాడు తానీషా.

'మరా విషయం చెప్పావా?' అడిగాడు బాలరాజు.

'నా సంగతి చెబుతానుగానీ, నువ్వు రేఖని పలకరించావా?' అనడిగాడు తానీషా.

'చూస్తున్నా. చదువుముందా, ప్రేమముందా?' అని ఆలోచిస్తున్నా.

'కనీసం మాటా మాటా కలపకుండానే ప్రేమ అంటే ఎలా?'

'అదీ నిజమే. ముందు నీ సంగతి చెప్పు'

'నీకు చెప్పలేదుగానీ నా కథ అప్పుడే యింటర్వెల్ దాటిపోయింది.'

'వార్నీ! చాలా ఫాస్టు నువ్వు. చెప్పు చెప్పు' అడిగాడు బాలరాజు.

తానీషా ప్రారంభించాడు. 'తొలిసారి నేను ఫిజియాలజీ ప్రాక్టికల్స్‌లో పడిపోయాను.'

'ఎందుకు పడిపోయావు ఎలా పడిపోయావు. ఎవరు నిన్ను లేవదీశారు?' బాలరాజు అడిగాడు.

'పడిపోవడం అంటే హసీనా బేగం అందానికి పడిపోయాను. ప్రాక్టికల్స్‌లో ఆమె వెతుక్కుంటుంటే ఆమెకు రింగర్ సొల్యూషన్ అందించాను. నా రియోస్టాట్ త్యాగం చేశాను. అంతే ఆమె తన చూపులతో నన్ను కట్టిపడేసింది.'

'వెరీ యింటరెస్టింగ్. నడు. అలా నడుస్తూ మాట్లాడుకుందాం' అన్నాడు బాలరాజు.

ఇద్దరూ క్లినికల్ క్యాంటీన్ వదిలి, హాస్పిటల్ బైటికి వచ్చి అజంతా హోటల్ కిళ్లీ కొట్టు దగ్గరికి నడిచారు. అక్కడ హిస్టరీ శర్మగారు వుప్పుచెక్కా, యాలకు పండు కిళ్లీ కట్టిమ్మని కిళ్లీ కొట్టు అప్పలాజుని అడుగుతున్నారు. అక్కడ బల్లమీద కూర్చున్న పాహియాన్ లేచి 'రండిసార్' అంటూ బాలరాజునీ తానీషాను ఆహ్వానించాడు శర్మగారు కిళ్లీ అందుకుని నోట్లో బిగించి 'వచ్చారా, కమాన్ కమాన్' అంటూ బెంచీ మీద కూర్చున్నాడు. 'తర్వాత కంటిన్యూ చేస్తాను' అన్నాడు తానీషా, బాలరాజుతో.

'ఏం ఫర్వాలేదు. వీళ్లు మనకి బాగా క్లోజేకదా. అలా బీచ్‌కి నడిచి మాట్లాడుకుందాం' అన్నాడు బాలరాజు.

'ఏం ఫర్వాలేదు తానీషా. చెప్పు అదేవిటో మేమూ వింటాం' అంటూ శర్మగారు కదిలారు. పాహియాన్ కూడా కలిశాడు. నలుగురు కోస్టల్ బ్యాటరీవైపు నడిచి బీచ్‌కి చేరారు. యింకా సాయంత్రం అవలేదు. బీచ్‌లో జనం పెద్దగా లేరు. ఎండతగ్గి వాతావరణం బాగా చల్లబడింది. సముద్రం కెరటాలతో వూగుతూ, ఆరేసుకున్న నీలం చీరె గాలికి కదుల్తున్నట్టుంది.

'ఊఁ - కంటిన్యూ' అన్నాడూ బాలరాజు.

'అసలేవిటి కంటిన్యూ' అడిగారు హిస్టరీ శర్మగారు.

'మనవాడి ప్రేమకథ' అన్నాడు బాలరాజు.

'నేనూ వింటాను ప్రేమకథ' అన్నాడు పాహియాన్.

'హిస్టరీలో ప్రేమ కథల్ని మించిన కథల్లేవు' అన్నారు శర్మగారు.

'చెప్పు - ఆ తర్వాత హసీనా బేగం ఏమంది?' అడిగాడు బాలరాజు.

'ప్రాక్టికల్స్ టేబుల్ మీద తట్టలోంచి జంప్ చేసిన రెండు కప్పలు దగ్గరగా చేరి బెక బెకలాడుకుంటున్నాయి. వాటిని చూస్తూ హసీనా 'మీకు అల్లా యిష్టమేనా' అనడిగింది. నాకు 'యెల్లా అయినా యిష్టమే అన్నాను. అదికాదు. దేవుడు 'అల్లా' అంది. నేను మళ్లీ అన్నాను. నాకు అల్లా, యేసు, సాయిబాబా, శ్రీ వెంకటేశ్వరుడు అందరూ యిష్టమే. అయినా మీ యిష్టమే నా యిష్టం - అని.

అలా మా పరిచయం లేడీస్ హాస్టల్ దగ్గరున్న శ్రీ సత్యన్నారాయణ స్వామి గుడిమెట్లమీదికీ హార్బర్ వేపున్న మసీదు చెట్ల చాటుకీ అల్లుకుపోతూ పెరిగింది.

'మరింకేం. అంతా బావుందికదా' అన్నాడు పాహియాన్.

'శుభస్య శీఘ్రం' అన్నారు శర్మగారు.

'కానీ - యింకో సంగతి. ఏం చెప్పను? ఎలా చెప్పనూ?'

'చెప్పవోయ్. సణక్క' అన్నాడు బాలరాజు.

'నా ప్రతిరూపం హసీనా బేగంలో పెరుగుతోందేమో అని అనుమానంగా వుంది.'

‘ఈ వయసులో కుర్రవాళ్ల ప్రతిరూపాలు యెందరో ఆడపిల్లల్లో పెరుగుతూనే వుంటాయి బాబూ‘ అన్నారు శర్మగారు.

‘ఏవిటి - నిజమే - నిజంగా నిజవేఁ?

‘ అడిగాడు బాలరాజు.

‘నిజమా - అంటే యింకా తేలలేదు‘ అన్నాడు తానీషా.

‘ఏడిసినట్టేవుంది. అంతా నీ భ్రమ అన్నమాట‘ అన్నాడు బాలరాజు.

‘కానీ వొకటి మాత్రం భ్రమకాదు‘ తానీషా.

‘ఏవిటది?‘ బాలరాజు.

‘ఆమె నన్ను ముస్లిం అనుకుంటోంది‘ తానీషా

‘అవును. తవరు తానీషా కదా‘ అన్నాడు పాహియాన్.

‘మరి నువ్వు చెప్పలేదా?‘ అడిగాడు బాలరాజు.

‘చెబితే దూరం అయిపోతుందేమోనని భయం‘ అన్నాడు తానీషా.

‘ప్రేమకు కులమత భేదాలు, సంపన్నులు, పేదలు యిలాంటి తేడాలేవీ తెలియవు. ఇప్పుడు నిజందాచి తరువాత యిబ్బంది పడేకంటే, ముందుగానే విషయం చెప్పెయ్యి. నీ నిజాయితీకి ఆమె యింకా దగ్గరవుతుంది‘ అని సలహా యిచ్చారు హిస్టరీ శర్మగారు.

‘అవును - గురువుగారు చెప్పింది అక్షరాలా నిజం‘ అని బాలరాజు, పాహియాన్ సమర్థించారు.

‘సరే చెప్పేస్తాను - కానీ వొక ప్రాబ్లమ్‘ సందేహించాడు తానీషా.

‘ఏవిటది?‘ అడిగాడు బాలరాజు.

‘హసీనా బేగం అన్నయ్య. పేరు జలాలుద్దీన్. చెంగల్రావు పేటలో కసాయి వ్యాపారం‘ తానీషా

‘ఆ విషయం అమ్మాయి చూసుకుంటుంది లెండి‘ పాహియాన్.

‘కాస్త ఆలోచించాల్సిన విషయమే‘ అన్నాడు బాలరాజు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

